# న్యాయం - ధర్మం

చాల సంవత్సరాల క్రితం ఒకరోజు మధ్యాహ్నం ఒంటరిగా కారులో ఏదో పని మీద వెడుతూ ఏవేవో ఆలోచనలో పడ్డాను. రేడియోలో ఏవో న్యాయ సూత్రాల చర్చ జరుగుతున్నది. అది వింటుంటే నా ఆలోచనలు ఇంకొక దారి పట్టాయి.

న్యాయపీఠం, న్యాయాధిపతి, న్యాయవాది, న్యాయ సూత్రాలు, లోక ధర్మం, ధర్మదేవత, ధర్మ సూత్రాలు, ఆశ్రమ ధర్మాలులాటి ఎన్నో మాటలు గుర్తుకి వచ్చాయి. అసలు న్యాయం, ధర్మం అనే మాటల్ని మనం సరిగ్గా అర్థం చేసుకున్నామా అనే అనుమానం వచ్చింది. అసలా రెండు మాటల్నీ మనం ఎలా వాడతున్నామా అని ఆలోచించటం మొదలుపెట్టాను.

'కడుపుతో వున్న భార్యని కారడవులకి పంపుట న్యాయమా?' అని అడుగుతుంది లవకుశ సినిమా డైలాగు. 'అన్యాయం గురూ! వాడు నా జేబు కొట్టేశాడు' అంటాడు జోగేశ్వర్రావు. 'ఆవిడకి మూడో కాన్పులో కూడా అమ్మాయే పుట్టినప్పటి నించీ, ఆమె జీవితం అన్యాయమై పోయింది' అంటుంది శోభ, రామలక్ష్మితో. 'నేను నీకు డబ్బులిచ్చినా వాడికి ఓటు వేస్తావా. ఇదేం న్యాయం?' అంటాడు ఎలక్షన్లలో నలిగిపోయిన వి. నాయకుడు. 'మిమ్మల్ని ఈ విషయంలో ముద్దాయికి న్యాయం చేయమని కోరుతున్నాను' అంటాడు అ. న్యాయపతి, బిఏ బిఎల్.

'చెట్టు చాటునించీ కొట్టటం అధర్మం' అంటాడు పురాణం సుబ్బారావు సుబ్బలక్ష్మితో. 'మా ఐదుగురికీ ఐదు వూళ్ళివ్వటం ధర్మం' అంటాడు ధర్మరాజు కృష్ణుడితో. 'ఆనాటి ధర్మ సూత్రాలు ఈనాడు పని చేయవు'....

ఇలాటి వాక్యాలెన్నో గుర్తొచ్చాయి. ఆలోచించగా చించగా ఎన్నో చిరుగులే కనపడ్డాయి. మనం ఈ మాటల్ని ఒక్కొక్కసారి ఒక్కొక్క రకంగా వాడుతూ, ఏది అసలో, ఏది పిసలో తెలియని స్థితిలో వున్నామా అనిపించింది. అసలు న్యాయం అంటే ఏమిటి? న్యాయానికీ ధర్మానికీ తేడా ఏమిటి? ఆ రెండూ ఒకటేనా?

ఇంటికి వెళ్ళగానే నా దగ్గర వున్న నాలుగైదు తెలుగు/ఇంగ్లీషు/తెలుగు డిక్షనరీలలోనూ, శబ్ద రత్నాకరంలోనూ వాటికి అర్థాలు వెతికాను. అవి చదివాక, వున్నదనుకున్న మతి కాస్తా పూర్తిగా పోయింది. శంకరనారాయణగారి తెలుగు ఇంగ్లీష్ డిక్షనరీలో ధర్మము అంటే డ్యూటీ, లా (అంటే చట్టం), కష్టం (ఆచారం), మొరాలిటీ (నీతి), కారెక్టర్ (గుణశీలం) అని వుంది. న్యాయం అంటే జస్టిస్ (చట్టరీతి), లాజిక్ (తర్కం) అనీ వుంది. బ్రౌన్ దొరగారూ ఇంగ్లీషులోనించీ తెలుగులోకి, కొంచెం తేడాతో అదే అన్నారు. జస్టిస్ అంటే న్యాయమూ ధర్మమూ అని కూడా అన్నారు. శబ్దరత్నాకరంలో ధర్మము అంటే న్యాయము, పుణ్యము, ఆచారము అని వుంది.

ఇన్ని అర్థాలలోనించీ, ఒక్కొక్కదానికీ ఎలా వివరణ ఇవ్వాలా అని దుర్యోధనుడిలా పైకి స్వగతం చెప్పుకుంటుంటే, శ్రీమతి అన్నది, 'నీలాటి ఇంజనీర్లతో

వచ్చిన గొడవే ఇది. ప్రతిదానికీ సోదాహరణంగా వివరణ కావాలి. న్యాయమయితే నేమిటి, ధర్మమయితే ఏమిటి, అవేవో పాటిస్తే పోలా' అని. అవేమిటో తెలీకుండా ఎలా పాటిస్తాం అనబోయి, నా తర్కాన్ని నా గొంతులోనే దాచేసుకున్నాను.

అప్పుడే శాన్ హోసే నించీ ఒక మిత్రుడు ఫోన్ చేసి, ఫలనా రోజున ఫలానా ఆయన మీ ఊరు వస్తున్నారు, ఒక సాహిత్య సదస్సు పెట్టుకుంటావా అని అడిగారు. అసలే సాహిత్యం మీద ఎనలేని మక్కువ, అందులోనూ ఏలూరుపాటి అనంతరామయ్యగారు... ఎగిరి గంతేద్దామనుకుని ఎందుకు రాత్రి పూట అనవసరపు హంగామా అనుకుని, వెంటనే ఒప్పేసుకున్నాను. రెండు వారాల్లో మా వూళ్ళో సదస్సు నిర్వహించాం. ఎప్పటిలాగానే కొంతమంది సాహిత్యం మీద ఇష్టం వల్లా, ఇంకొంత మంది నేను పిలిచానని మొహమాటంతోనూ... దాదాపు డెభ్బై మంది వచ్చారు. సదస్సు చాల బాగా జరిగింది. చివరిలో ఆయన్ని అడిగాను - 'న్యాయానికీ, ధర్మానికీ తేడా ఏమిటండీ' అని.

ఆయన చెప్పిన సమాధానం నాకు బాగా నచ్చింది. నాకే కాదు ఆ రోజు వచ్చిన చాలమందికి కూడాను.

న్యాయం అనేది లోక ధర్మాన్ని బట్టి, చట్టరీత్యా మనం ఏర్పరచుకున్న నియమం లేదా నియమాలు. ఆ న్యాయాన్ని ఉల్లంఘిస్తే, ఆయా న్యాయసూత్రాల్ని బట్టి శిక్ష పడే అవకాశమూ వుంది.

కానీ ధర్మమనేది లోక ధర్మం. మనం ఎవరిమయినా, ఎక్కడవున్నా ధర్మం అనేది అందరికీ ఒకటే. ధర్మం తప్పితే, మన మనసుకే సమాధానం చెప్పుకోవాలి.

దీనికి కొంచెం వివరణ అవసరమేమో. సోదాహరణంగా చూద్దాం.

ఒక మనిషిని ఇంకొక మనిషి చంపటం మానవతా ధర్మం కాదు. కానీ ఒక యుద్ధంలో చంపటం, ఆత్మరక్షణ కోసం చంపటం చట్టరీత్యా న్యాయ సమ్మతమే. న్యాయస్థానం శిక్ష వేయకుండా ఒప్పుకుంటుంది. అంటే కొన్ని విషయాల్లో ధర్మం ఒప్పుకోక పోయినా, న్యాయం ఒప్పుకోవచ్చు. అలాగే పెద్దలని గౌరవించటం ధర్మం. గౌరవించకపోతే న్యాయస్థానం శిక్షించదు. అంటే కొన్ని విషయాల్లో న్యాయం ఒప్పుకున్నా, ధర్మం ఒప్పుకోకపోవచ్చు. అలా గౌరవించకుండా, ఇంకా ఏదన్నా చట్టధిక్కారం చేస్తేనే న్యాయం తప్పినట్టు.

అలాగే ఒక చోట న్యాయం, ఇంకొక చోట న్యాయ సమ్మతం కాకపోవచ్చు. ఒక రోడ్డు మీద గంటకి 35 కిలో మీటర్ల వేగం శిక్షార్హమైతే, కొన్ని హైవేల మీద అది ఎక్కువేమీ కాదు. కొని మతాల్లో ఒకరికన్నా ఎక్కువ మంది భార్యలుంటే శిక్ష పడుతుంది. ఇంకా కొన్ని మతాల్లో అది న్యాయ సమ్మతమే.

0 0 0

'ఇదేం న్యాయం బాబూ! కృష్ణానదిలోకి డబ్బులు విసిరేస్తున్నారు కానీ, నేను ఆకలితో చస్తున్నా ఏమీ ధర్మం చేయటం లేదు' అంటున్నాడు వెడుతున్న రైల్లో బిచ్చగాడు.

0 0 0